
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు

శనివారం 21 డిసెంబరు 2024

సూక్ష్మకళ.. భళా..!

పెన్సిల్ ముక్కపై ధ్యానచిత్రం



నంద్యాల కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ శుక్రవారం ప్రపంచధ్యాన దినోత్సవం సందర్భంగా పెన్సిల్‌ముక్కపై ధ్యానం చేస్తున్న వ్యక్తి, ప్రపంచ భూగోళం ఇలా రెండు సూక్ష్మచిత్రాలను వాటర్ కలర్స్‌తో మైక్రోబ్రష్ ద్వారా చిత్రీకరించారు. ధ్యానం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని అంటున్నారు ఆయన. డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా చిత్రకారుడు కోటేష్ పెన్సిల్ ముక్కపై ధ్యానం చేస్తున్న వ్యక్తి, భూగోళం రెండు సూక్ష్మచిత్రాలను చిత్రీకరించి ఔరా అనిపించారు.



పెన్సిల్‌ముక్కపై ధ్యానం చేస్తున్న వ్యక్తి, భూగోళం చిత్రం




బండర్లపల్లె చెక్‌పోస్టు వద్ద లోడ్ వాహనాలతో రోడ్డు దిగ్బంధనం చేసిన నాపరాయి పరిశ్రమల యజమానులు

అప్పుడు తప్పు..
ఇప్పుడు ఒప్పా..?

- నాడు విమర్శించి నేడు చేస్తున్నదేమిటి..?
- 'కూటమి'పై నాపరాయి పరిశ్రమల యజమానుల అసంతృప్తి
- గత ప్రభుత్వ విధానాన్నే అమలు చేస్తోందని ఆగ్రహం
- కన్సిడరేషన్ పన్ను చెల్లించాలనడంపై సర్వత్రా ఆందోళన
- ఉపాధి లేక రోడ్డున పడుతున్న కార్మికులు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు తెగ విమర్శలు చేశారు. కన్సిడరేషన్ పన్నుతో నాపరాయి పరిశ్రమ మూతబడేలా చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమ వర్గాల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత రావడంతో గత ప్రభుత్వం పన్ను వసూలు వసూలు చేయడం ఆపేసింది. అయితే అప్పట్లో వైసీపీ తీరు సరైంది కాదని చెప్పుకొచ్చిన టీడీపీ నేతలు, అధికారంలోకి రాగానే అదే విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో పరిశ్రమ యజమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం చేసింది తప్పయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్నది ఒప్పా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం నాపరాయి పరిశ్రమలు నడవలేని పరిస్థితికి వచ్చాయి. ఉపాధి లేక వందలాది మంది కార్మికులు రోడ్డున పడుతున్నారు. ఇప్పటికైనా కన్సిడరేషన్ పన్ను చెల్లింపులను ఆపాలని డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

నంద్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జిల్లాలో నాపరాయి పరిశ్రమ ఓ వెలుగు వెలిగింది. ముఖ్యంగా బనగానపల్లె నియోజకవర్గంతో పాటు, బేతంచర్ల వంటి ప్రాంతాల్లో ఈ పరిశ్రమలు ఎక్కువగా ఉండేవి. దీనిపైన వందలాది మంది జీవనోపాధి పొందేవారు. వైసీపీ వచ్చాక ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. లేనిపోని నిబంధనలు పెట్టడంతో పాటు, ఇష్టారీతిన పన్నులు వేయడంతో నాపరాయి పరిశ్రమ పూర్తిగా దెబ్బతింది. అయితే ప్రభుత్వం మారిన తర్వాత తమ బతుకులు మారతాయని ఆశించిన పరిశ్రమ యజమానులకు అవే తిప్పలు తప్పడం లేదు. అప్పట్లో తీసుకువచ్చిన జీవోలను ఇప్పుడు అమలు చేసి నాపరాయి పరిశ్రమ లేకుండా చేసేందుకు పూనుకుందనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి కన్సిడరేషన్ ఫీజు తొలగించటమే కాకుండా గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలు, విధానాలను మార్చి పరిశ్రమను ఆదుకోవాలని పరిశ్రమ యజమానులు కోరుతున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH

ABSTRACT

Mines & Minerals – Levy of Consideration amount on all Minor Minerals in Addition to the Seigniorage Fee, DMF and MERIT – Orders – Issued.

INDUSTRIES & COMMERCE (M.III) DEPARTMENT

G.O.MS.No. 42 Dated: 07-06-2021

Read the following:

1. G.O.Ms.No.29, Ind. & Com. (Mines III) Dept. dated 15.02.2017
2. G.O.Ms.No.21, Ind. & Com. (Mines III) Dept. dated 26.03.2021
3. From the Director of Mines & Geology, single file No: [illegible]/2021

ORDER:

Government, vide G.O.1st read above, have included a pre-emption clause to direct the lessees to sell minerals to the processing industries duly paying the Consideration Amount in addition to Seigniorage Fee, Contribution to DMF and MERIT to the State Government.

2. In the G.O., 2nd read above, Government have ordered that the Silica Sand lease holders shall also pay Consideration Amount of Rs.21.27/- per ton to the State Government in addition to the Seigniorage Fee, DMF and MERIT and to use the collected fund for the purposes as specified therein.

3. The DM&G, AP., in the single file 3rd read above, while referring to the recommendations of the State Level Core Committee and keeping in view the suggestions made during review meetings on Mineral Revenue receipts and Policy aspects of Department of Mines & Geology, has requested the Government to issue of necessary orders for levy of consideration amount, on the similar lines of Silica Sand orders issued vide GO 2nd read above, on the lease holders in addition to the Seigniorage Fee, DMF and MERIT, duly fixing it as one time of Seigniorage fee for all minor minerals other than granite and 0.5 time of Seigniorage fee for granite, since it is high value mineral (Seigniorage fee ranges from Rs.3,453 to Rs.4,608 per cum) irrespective of the mode of grant of leases.

2021లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చి కన్సిడరేషన్ పన్ను జీఓ



మూతపడిన నాపరాయి పరిశ్రమ యూనిట్

ఏమిటీ కన్సిడరేషన్ ఫీజు..?

కొవిడ్ తర్వాత అన్ని రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ ఖజానాకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో కొవిడ్ వల్ల నష్టపోయిన పరిశ్రమలను తిరిగి గాడిలో పెట్టేందుకు, కార్మికులకు ఉపాధి కల్పించడానికి, చిన్న తరహా పరిశ్రమల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వద్ద సరైన నిధులు లేకపోయాయి. ఇందుకోసం మైనింగ్ పరిశ్రమల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం పూనుకుంది. దీనికి కన్సిడరేషన్ ఫీజు అని పేరు పెట్టింది. ఆయా మైనింగ్ పరిశ్రమల నుంచి వసూలు చేస్తున్న సీనరేజి పన్ను, డీఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్), మెరిట్ ఫీజుతోపాటు అదనంగా ఈ కన్సిడరేషన్ ఫీజు కట్టాలని ఆదేశిస్తూ 2021 జూన్‌లో జీఓఎంఎస్ నంబరు 42 విడుదల చేసింది. దీని ప్రకారం ఇసుక, సిలికా వంటి వాటికి సీనరేజ్ పన్ను మొత్తానికి వంద శాతం అదనంగా కన్సిడరేషన్ ఫీజు వసూలు చేసింది. గ్రానైట్ ధర ఎక్కువ కావటంతో కన్సిడరేషన్ పన్ను వంద శాతం వసూలు చేస్తే ఆ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడుతుందని భావించి, కన్సిడరేషన్ పన్నును 50 శాతానికి కుదించింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా భారీ ఖనిజాలకు సంబంధించిన పరిశ్రమలకు వర్తింపజేసే నిబంధనలనే నాపరాయి పరిశ్రమకు వర్తింపజేసింది. అంతంతమాత్రం ఆదాయం ఉండే నాపరాయి పరిశ్రమ యజమానులు కూడా వంద శాతం కన్సిడరేషన్ ఫీజు కట్టే పరిస్థితి ఏర్పడింది.

మిగతా 6లో..

పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఏసీఎఫ్ ధనరాజ్

మహానంది, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు శ్రీశైలం అటవీ బయో డైవర్సిటీ ఏసీఎఫ్ ధనరాజ్ తెలిపారు. శుక్రవారం మహానంది అటవీ పర్యావరణ విద్యాకేంద్రంలో అటవీ సిబ్బందికి మూడో విడత శిక్షణ కార్యక్రమం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీఎఫ్ ధనరాజ్ మాట్లాడుతూ నల్లమలలో వన్యప్రాణులను సులభంగా గుర్తించేందు కోసం రెండు వేల అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ టీ ఆర్, కారిడార్ ద్వారా రెండు విడతలుగా నల్లమలలో ఆధునిక కెమెరాలను వచ్చే ఏడాది జనవరి, మార్చి నెలల్లో ఏర్పాటు చేస్తామన్నారు. దీనివల్ల అడవిలో లభించే గడ్డి మొక్కలతో పాటు వన్య ప్రాణులు ఏవిధంగా ఆహారం పొందుతున్నాయన్న అంశాలను తెలుసుకోవచ్చునని చెప్పారు. అలాగే పులుల గణన సులభతరం అవుతుందన్నారు. దీంతో పాటు సిబ్బంది పులుల సంరక్షణ చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. సీసీ ఫుటేజీల ద్వారా సేకరించిన ఆధారాలను అటవీ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో నమోదు చెయ్యాలని చెప్పారు. కార్యక్రమంలో అటవీ సిబ్బందితో పాటు హైటీకాస్ సంస్థ ప్రతినిధులు శ్రీధర్, శంకర్‌లు పాల్గొన్నారు.

నేడు ప్రాజెక్టుల
కమిటీ ఎన్నికలు..!

- ఇప్పటికే కేసీ కమిటీ చైర్మన్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం
- కొద్ది గంటల్లో తేలనున్న ఎస్సార్బీసీ, తెలుగుగంగ చైర్మన్, వైస్ చైర్మన్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నంద్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టుల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు శనివారం జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు, డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ)లకు ఇప్పటికే ఎన్నికలు జరిగాయి. వీటిలో అన్నిటికీ కూటమి మద్దతుదారులే ఎన్నికయ్యారు. ఇక ముఖ్యమైన కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్బీసీ ప్రాజెక్టుల ఎన్నికలు ఒకటే మిగిలాయి. అయితే ఇప్పటికే కేసీ కెనాల్ చైర్మన్‌గా బన్నూరు రామలింగారెడ్డిని కూటమి అధిష్ఠానం నిర్ణయించింది. ఇక మిగిలిన తెలుగు గంగ, ఎస్సార్బీసీ ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఎవరు దక్కించుకుంటారనే ఉత్కంఠ నెలకొంది. ఈ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కేసీ కెనాల్ ప్రాజెక్టుకు ఎన్నికలు నంద్యాలలోని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయంలో జరగనుండగా, ఎస్సార్బీసీ ఎన్నికలు నందమూరి నగర్‌లోని ఎస్సార్బీసీ సర్కిల్-2లో, తెలుగు గంగ ఎన్నికలు తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈ కార్యాలయంలో జరగనున్నాయి. ఎన్నికలు ఉదయం 9 గంటలకు మొదలై 10 గంటలకు ఫలితాలు వెలువడుతాయని అధికారులు చెబుతున్నారు.

చక్రం తిప్పుతున్న నాయకులు..

సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తిగా రైతులకు సంబంధించిన విషయం. ఆయా సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, చెరువులు, వాటి పరిధిలోని ఆయకట్టు గురించి పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తులు సాగునీటి సంఘాలు, డీసీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎంపికైతే రైతులకు మేలు జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు పక్త రాజకీయ ఎన్నికలను తలపిస్తున్నాయి. ఇప్పటి వరకు జరిగిన సాగునీటి, డీసీ ఎన్నికలను పరిశీలిస్తే ఇదే అర్థమవుతోంది. ఇక నేడు జరగబోయే ఎన్నికలు కూడా ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. ఇప్పటికే కేసీ కెనాల్ ప్రాజక్టు కమిటీకి బన్నూరు రామలింగారెడ్డి ఎంపిక వెనుక పూర్తి రాజకీయ ప్రోద్బలమే ఉందన్నది కాదనలేని నిజం. ఇక మిగిలి ఉన్న ఎస్సార్బీసీకి, తెలుగుగంగ కమిటీలు కూడా ఆ నియోజకవర్గ నాయకులు ఆశీస్సులు ఉన్న వారికే దక్కుతాయనే అభిప్రాయం వినిపిస్తోంది.

కేసి కెనాల్ ప్రాజెక్టు పరిధిలో 9 డీసీలు ఉండగా, తెలుగు గంగ, ఎస్సార్బీసీ ప్రాజెక్టు కింద 8 చొప్పున డీసీలు ఉన్నాయి. వీరిలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఆయా డీసీలు ఎన్నుకుంటారు. వీరంతా ఆయా నియోజకవర్గ నాయకులకు సంబంధించిన వారే కాబట్టి వీరి ఎంపిక కూడా లాంఛనమేనని, కానీ ఎన్నిక ప్రక్రియ ఒకటి ఉంది కాబట్టే ఈ తతంగమంతా బైటికి సాగాలనే అభిప్రాయం ఉంది. ఏదైమైనా ఈ మూడు ప్రాజెక్టుల్లో రెండింటికి సంబంధించిన ఉత్కంఠ నేడు వీడనుంది.

తిమ్మాపురం మోడల్ స్కూల్‌కు
విప్రో జాతీయ అవార్డు



తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్ భవనం

మహానంది, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ, జీవ వైవిధ్యంపై ప్రతి ఏటా విప్రో సంస్థ అందించే విప్రో జాతీయ అవార్డుకు మహానంది మండలం ఎం.తిమ్మాపురం ప్రభుత్వ మోడల్ స్కూల్ ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి 1500కి పైగా ప్రాజెక్టులు విప్రో సంస్థకు వెళ్లాయన్నారు. అయితే తమ పాఠశాల నుంచి పంపిన జీవ వైవిధ్యం ప్రాజెక్ట్‌కు జాతీయ అవార్డు దక్కిందన్నారు. వృక్షశాస్త్ర అధ్యాపకురాలు శైలజ పర్యవేక్షణలో విద్యార్థుల బృందం చేసిన కృషికి ఈ అవార్డు దక్కిందన్నారు. ఫిబ్రవరిలో జరుగునున్న జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో మెమోంటో, సర్టిఫికెట్లతో పాటు నగదు రూ.50 వేల నగదు ప్రోత్సాహం, ఉచిత విమాన ప్రయాణం అవకాశం లభిస్తుందని తెలిపారు. జాతీయ స్థాయి అవార్డుకు కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అధికారులు, తల్లిదండ్రులు అభినందించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి: కలెక్టర్



వైద్యాధికారులతో సమావేశమైన కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో వైద్య సేవలు మెరుగుపడాలని, ఓపీ సంఖ్య పెరగడంతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతాశిశు మరణాల జీరో స్థాయికి చేరుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు స్త్రీ శిశు సంక్షేమ అధికారులను సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్యసేవలు మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గుండె సంబంధిత చికిత్సలు, ఇంజెక్షన్లు, ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రభుత్వాసుపత్రులలో కాలం చెల్లిన మందులు, ఇతర వృథా పరికరాలను టెండర్లను పిలిచి వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఓర్వకల్లులో సెమీ కండక్టర్ పరిశ్రమ

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

7

ఆ హాస్టల్‌లో అన్నీ సమస్యలే

- లద్దగిరి వసతి గృహంలో విద్యార్థుల ఇబ్బందులు

6

ఆదోని మార్కెట్ యార్డుకు ఆధునిక సొబగులు

- అభివృద్ధి పనులకు రూ.21 కోట్లతో ప్రతిపాదనలు
- రైతులకు మౌలిక వసతుల కల్పన
- గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలో ఆదోని మార్కెట్ కమిటీపై దృష్టి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం మార్కెట్ కమిటీల అభివృద్ధిని విస్మరించింది. ఫలితంగా మార్కెట్ యార్డుల్లో విక్రయానికి తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కూడా నోచుకోలేదు. రూ.కోట్ల ఆదాయం ఉన్న పనులు చేపట్టలేని పరిస్థితి. కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ అభివృద్ధిపై దృష్టి సారించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ. ఇక్కడ నిత్యం వేల వ్యవసాయ పంట ఉత్పత్తులకు క్రయవిక్రయాలు, జిల్లా రైతులే కాకుండా పక్క జిల్లాలైన అనంతపురం, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ ప్రాంత రైతులతో కళకళలాడుతుంది. ఏటా రూ.1800 కోట్లు ప్రత్యక్షంగా, మరో రూ.200 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతాయి. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల సెస్సు రూపంలో ఏడాదికి రూ. 16 నుంచి రూ.18 కోట్లు ఆదాయం సమకూరుతుంది. జాతీయ స్థాయిలో ఈ-నామ్ బిడ్డింగ్ దాఖలలో గుర్తింపు పొందింది. రైతులకు పోటీతత్వం ద్వారా మంచి ధర, తూకాల్లో చెల్లింపుల్లో పారదర్శకత, వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి చూపుతున్న మార్కెట్ కమిటీని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల అభివృద్ధి కుంటుపడింది. ఐదేళ్లలో నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేయకపోవడంతో వారు పనులు చేయకుండా వెనక్కి వెళ్లారు. రైతులు కనీస వసతులకు కూడా నోచుకోలేకపోయారు. వర్షానికి పంట ఉత్పత్తులు మార్కెట్‌లో తడిసి కొట్టుకుపోయిన సందర్భంగా తీవ్రంగా నష్టపోయారు. వీటన్నింటిని కూటమి ప్రభుత్వం చక్కదిద్ది నిధులు కేటాయించే పనిలో పడింది. ఇటీవల మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయదుర్గ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ డీఈ సుబ్బారెడ్డిని ఆదేశించారు. ఎమ్మెల్యే పార్థసారధి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సైతం మార్కెట్ యార్డుపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో సైతం గళం విప్పారు. మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపునకు రూ.21.48 కోట్లు అవుతుందని నివేదిక తయారు చేసి అధికారులకు అందజేశారు. ఆమోదం తెలిపితే మార్కెట్ యార్డ్‌కు నూతన సొబగులు సంతరించుకోనున్నాయి.



అదోని మార్కెట్ యార్డు

మిగతా 7లో

ఆ హాస్టల్‌లో అన్నీ సమస్యలే..!

లద్దగిరి వసతి గృహంలో విద్యార్థుల ఇబ్బందులు

ఆ హాస్టల్లో తలుపులు, కిటికీలు సరిగా ఉండవు. వర్షం వస్తే గోడలకు నెమ్ము వస్తుంది. గదుల పైపెచ్చు తరచూ ఊడి పడుతూ ఉంటుంది. టాయిలెట్లు, స్నానపు గదుల పని తీరు అంతంత మాత్రమే. ఇన్ని సమస్యల మధ్య సుమారు 450 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కోడుమూరు మండలంలోని లద్దగిరి గ్రామంలో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం 1, 2 ఉన్నాయి. ఇక్కడ వివిధ ప్రాంతాల పేద విద్యార్థులు చేరారు. సీట్లు పొందిన వారిలో 4 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉన్నారు.





బాలుర వసతి గృహం

కోడుమూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లద్దగిరి బీసీ బాలుర వసతి గృహం-1లో 250 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో మూడు భవనాలు ఉన్నాయి. ఆయా భవనాల్లో ఒకదాంట్లో 10 గదులు ఉండగా 8 గదులు దెబ్బతిన్నాయి. ఇందులో బాగున్న రెండు గదులను సామగ్రి, కూరగాయలు, పప్పు దినుసులకు వాడుతున్నారు. దెబ్బతిన్న 8 గదులకు పైపెచ్చులు ఊడుతోంది. కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ కూడా సరిగా లేదు. వర్ష తుంపరలు, దోమలు, చలి మధ్యనే విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి. ఈ భవనాలు సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించినట్లు తెలుస్తోంది. వసతి గృహం -2లో 200 మంది విద్యార్థులు ఉండగా, మొత్తం మూడు హాళ్లు ఉన్నాయి. ఇందులో రెండు హాళ్లు అధ్వానంగా ఉన్నాయి. ఒక హాల్ మాత్రమే బాగుంది. రెండు హాస్టళ్లకు కలిపి బాత్రూంలు 10, టాయిలెట్లు 32 ఉన్నాయి. 12 టాయిలెట్లు మాత్రమే బాగున్నట్లు అంటున్నారు. మరుగుదొడ్ల కొరతతో మలవిసర్జనకు విద్యార్థులు సమీప పొలాల్లోకి వెళ్తున్నారు. ఇక స్నానానికి ఇబ్బందులు తప్పడం లేదు. హాస్టల్ ప్రాంగణంలో ఉన్న మినీ ట్యాంకు వద్దనే స్నానాదులు ముగిస్తున్నారు. వాస్తవానికి ప్రతి పది విద్యార్థులకు ఒక్కోటి చొప్పున బాత్రూం, టాయిలెట్ ఉండాలి. హాస్టల్‌కు తాగునీటి సరఫరా కోసం రెండు ట్యాపులు ఉన్నాయి. కిచెన్ షెడ్ దెబ్బతింది. షెడ్ ఎప్పుడైనా కూలవచ్చు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో హాస్టల్-1లో ఉన్న విద్యార్థులను భద్రత దృష్ట్యా పక్కనే ఉన్నత పాఠశాలలోకి మార్చారు. పాఠశాలలో నాలుగు గదులను హాస్టల్ విద్యార్థులకు కేటాయించారని వార్డెన్ రమేష్ తెలిపారు. దీంతో 1వ హాస్టల్ విద్యార్థులు పాఠశాల గదుల్లోకి మకాం మార్చారు. అదీను ఈ ఏడాది ఆఖరు వరకు మాత్రమేనని తెలిసింది. ఇంకో సమస్య హాస్టల్ వెనుక భాగంలో ప్రహరీ ఎత్తు పెంచాల్సిన అవసరం కూడా ఉంది. వర్షాకాలంలో ప్రాంగణంలో నీరు నిలిచి బురదగా మారుతుంది.

భవనాలను నూతనంగా నిర్మించాలి



లద్దగిరి హాస్టళ్లలో సమస్యల మధ్యనే విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. పలు గదులు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారాయి. గదులకు తలుపులు, కిటికీలు కూడా సరిగా లేవు. చాలా వరకు టాయిలెట్లు పని చేయక విద్యార్థులు బయటకు వెళ్లే పరిస్థితి నెలకొంది. స్నానపు గదులు కూడా తగినన్ని లేవు. అధికారులు స్పందించి దెబ్బతిన్న వాటి స్థానంలో నూతనంగా నిర్మించాలి.

\- రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ నాయకుడు

అధికారులు పరిశీలించారు

హాస్టల్ భవనాలను అధికారులు పరిశీలించారు. చాలా కాలం కిందట నిర్మించినందున పెచ్చులూడుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాస్టల్ 1లో విద్యార్థులను పక్కనే ఉన్నత పాఠశాల గదుల్లోకి మార్చాం. గతంలో హాస్టల్‌ను పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు.

\-రమేష్, వార్డెన్



మరుగుదొడ్ల దుస్థితి



కూలేందుకు సిద్ధంగా ఉన్న వంట గది



పెచ్చులూడిన పైకప్పు

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూల లీగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు కోర్టుకు వెళ్లకుండా మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తే సత్వర న్యాయం పొందవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది తెలిపారు. మధ్యవర్తిత్వంపై స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటలపాటు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు అన్ని జిల్లా కోర్టుల్లో మధ్యవర్తిత్వాన్ని ప్రవేశపెట్టాలని తీర్మానించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీవరకు మధ్యవర్తిత్వం ఎలా నిర్వహించాలనే అంశంపై చెన్నై, బెంగుళూరు నుంచి వచ్చిన సిబ్బంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి, శిక్షకులు ఎస్. అరుణాచలం, ఎస్ఎస్ సుధ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

సంఘాలకు మళ్లీ ఇన్‌చార్జిల పాలనే..

● 2018 నుంచి ఇదే పరిస్థితి ● రైతులకు దక్కని రుణాలు



కల్లూరు వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలతో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. ఈసారి ఎన్నికల షెడ్యూల్ వస్తుందని, పదవులను దక్కించుకోవచ్చని నాయకులు వారి అనుచరులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలతోపాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు మరో ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జిలే పదవిలో కొనసాగుతారని జిల్లా సహకార అధికారి రామాంజనేయులు తెలిపారు.

ధరలన్నీ ఢమాల్..

క్వింటంపై రూ.1000 కంటే ఎక్కువే పడిపోయింది

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన పంట ఉత్పత్తుల ధరలన్నీ పతనమైపోయాయి. ప్రధానంగా వేరుశనగ కాయలు గత నెల రూ.6 వేలకు పైగానే ధర ఉండగా ప్రస్తుతం రూ.5,900 మాత్రమే రైతుకు దక్కింది. మధ్యస్థ ధర రూ.5,301, కనిష్ఠ దర ఘోరంగా రూ.2,811 మాత్రమే దక్కింది. ప్రభుత్వం వేరుశనగ కాయలకు రూ.6,700 మద్దతు ధర ప్రకటించింది. వెంటనే మార్క్‌ఫెడ్ అధికారులు కర్నూలు మార్కెట్ యార్డులో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఉల్లిగడ్డల ధర మరింత దిగజారి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. వారం రోజుల కిందట రూ.4వేలకు పైగానే గరిష్ఠ ధర ఉండగా శుక్రవారం గరిష్ఠ ధర రూ.3,009, మధ్యస్థం రూ.2,459, కనిష్ఠం రూ.1,429 మాత్రమే దక్కింది. ఎండుమిరప కాయలది కూడా అదే పరిస్థితి. గత సంవత్సరం ఇదే సమయంలో క్వింటం ఎండుమిర్చి గరిష్ఠ ధర రూ.30 వేలకు అమ్ముడుపోగా ప్రస్తుతం గరిష్ఠ ధర రూ.15,513, మధ్యస్థం రూ.12,869, కనిష్ఠం ఘోరంగా రూ.1,699 మాత్రమే దక్కింది. కొర్రలకు గరిష్ఠ ధర రూ.2669, మధ్యస్థం రూ.2491, కనిష్ఠం రూ.1,891 లభించింది. సజ్జలకు గరిష్ఠ ధర రూ.2,329, మధ్యస్థం రూ.2,109, కనిష్ఠ ధర రూ.2,109 పలికింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,330, మధ్యస్థ ధర రూ.2,259, కనిష్ఠ ధర కూడా రూ.2,259 అందింది. కందులకు ధర పూర్తిగా పతనమవుతోంది. నిన్నమొన్నటి దాకా రూ.9,500 నుంచి రూ.9వేలకు పైగానే రైతుకు లభించగా శుక్రవారం గరిష్ఠం రూ.8,019కు పడిపోయింది. మధ్యస్థ ధర రూ.7519, కనిష్ఠ ధర రూ.2,889 మాత్రమే దక్కింది. కందులకు గరిష్ఠ ధర రూ.4,599, మధ్యస్థ ధర రూ.4,006, కనిష్ఠ ధర రూ.1000 మాత్రమే దక్కింది.



అప్పుడు తప్పు.. ఇప్పుడు ఒప్పా..?

(5వ పేజీ తరువాయి)

గతం వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కన్సిడరేషన్ పన్నుపై నాపరాయి పరిశ్రమ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ఈ పన్నును అప్పట్లో వసూలు చేయలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అప్పటి నుంచి ఉన్న బకాయి కన్సిడరేషన్ పన్ను వసూలుకు సిద్ధమైంది. అంటే ఈ లెక్కన వైసీపీ నిబంధనలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లే లెక్క. మరి అప్పట్లో వైసీపీ విధానాలు సరైనవి కావని చెప్పుకొచ్చిన టీడీపీ నేతలు, అధికారంలోకి రాగానే ఎలా అమలు చేస్తున్నారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం చేసింది తప్పయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్నది కూడా తప్పు కాదా అన్న వాదన వినిపిస్తోంది. ఈ విమర్శలు ఏమీ పట్టించుకోని కూటమి ప్రభుత్వం కన్సిడరేషన్ పన్నును నాపరాయి పరిశ్రమపై బలంగా రుద్దుతోంది. రెండు మూడు రోజుల క్రితం నుంచి నాపరాయిని రవాణా చేసేందుకు సంబంధిత యజమానులు ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తు చేస్తుండగా వారికి కన్సిడరేషన్ పన్ను అంటూ లక్షల రూపాయిల బకాయిలను చూపుతోంది.

మూతబడుతున్న నాపరాయి పరిశ్రమ..

ఒకప్పుడు ఇల్లు కట్టుకునే ప్రతివారు నాపరాయిని వాడేవారు. ప్రస్తుతం అంతా గ్రానైట్, టైల్స్ వైపు చూస్తున్నారు. దీంతో జిల్లాలోని నాపరాయి పరిశ్రమ పూర్తిగా దెబ్బతింటోంది. నాపరాయి పరిశ్రమలను ఆదుకుని, దీనిపైన ఆధారపడిన వారికి మేలు చేకూర్చేలా నిబంధనలు సడలించాల్సిన గత ప్రభుత్వం మరిన్ని కఠిన నిబంధనలను తీసుకువచ్చింది. ఖనిజాల్లో మేజర్, మైనర్ అంటూ విభాగాలు ఉంటాయి. మేజర్ ఖనిజ పరిశ్రమలు పెట్టాల్సిన నిబంధనలను నాపరాయి పరిశ్రమకు వర్తింపజేసింది. దీంతో ఈ పరిశ్రమ మరింత ఇబ్బందుల్లో పడింది. పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేని నాపరాయి పరిశ్రమకు కూడా నిబంధన విధించింది. లైసెన్సు ఫీజును భారీగా పెంచేసింది. కొత్తగా లైసెన్సు తీసుకోవడానికి అయ్యే ఖర్చు కంటే రెన్యువల్ చేసే వారి నుంచి మరింత ఎక్కువ ఫీజు వసూలు చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న నాపరాయి పరిశ్రమలు నడవలేని పరిస్థితికి వచ్చాయి. ఏ స్థాయిలో అంటే జిల్లా వ్యాప్తంగా నాపరాయి పరిశ్రమలు 200 కాస్త, 40కి పడిపోయాయి. మిగతావన్నీ కఠిన నిబంధనల వలలో చిక్కుకుని రెన్యువల్ అవలేదు.

ఆదుకోని కూటమి ప్రభుత్వం..

వైసీపీ ప్రభుత్వ తీరుతో ఎక్కువ సంఖ్యలో నాపరాయి పరిశ్రమలు మూతపడటంతో దీనిపైన ఆధారపడిన వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. వీరిని ఆదుకుంటామని, 2014-2019 వరకు ఏ నిబంధనలు ఉన్నాయో వాటినే అమలు చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం వారి గురించి పట్టించుకున్నది లేదు. పైగా 2019-2024 వరకు వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే అనుసరిస్తోంది. పైగా కన్సిడరేషన్ పన్నును తీసేస్తుందా అంటే వచ్చే నెల 10 వరకు పెండింగ్ బకాయిలు చెల్లించే వెసులుబాటు కల్పిస్తామని, కానీ తర్వాతైనా బకాయిలు చెల్లించాల్సిందేనని జిల్లా మైనింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు పెండింగ్ బకాయిలు కట్టినట్లు రశీదు ఉంటేనే రవాణాకు అనుమతిస్తామని చెక్‌పోస్టు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవటంపైన, ప్రభుత్వ శాఖల ద్వంద్వ వైఖరిపైన విసిగెత్తిపోయిన నాపరాయి పరిశ్రమ యజమానులు కడుపు మండి ధర్నాలకు దిగుతున్నారు. రెండ్రోజుల కింద నంద్యాల, అనంతపురం చెక్‌పోస్టు వద్ద వందలాది నాపరాయి లోడు వాహనాలను అడ్డుగా పెట్టి రోడ్డు దిగ్బంధనం చేయగా గురువారం బేతంచర్లలో రోడ్డుపైన ధర్నా చేశారు. ఏ ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించదని, ఇలా రూ.లక్షల్లో పన్నులు వసూలు చేస్తే ఉన్న కొద్ది రోజుల్లో నాపరాయి పరిశ్రమలు మూతపడటం ఖాయమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

నాపరాయి పరిశ్రమ యజమానుల కష్టాలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం

నాపరాయి కన్సిడరేషన్ ఫీజుపై నాపరాయి గనుల యజమానుల నిరసన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాం. నాలుగు రోజుల నుంచి కొలిమిగుండ్ల మండలం బండార్లపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాలను నిలిపి దర్నా చేసిన విషయంపై ప్రభుత్వానికి నివేదించాం. మైనింగ్ యజమానులకు ఆన్‌లైన్‌లో రూ.లక్షల్లో కన్సిడరేషన్ ఫీజు చూపుతోంది. ఈ విషయాన్ని రోడ్లు భవనాల శాఖామంత్రి దృష్టికి తీసుకు వెళ్లాం. రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఒక నిర్ణయం వెలువడనుంది.

\-రాజగోపాల్, మైనింగ్ ఏడీ



గురువారం బేతంచర్లలో లోడ్ వాహనాలతో నాపరాయి పరిశ్రమ యజమానుల ధర్నా

ప్రభుత్వానికి పడిపోయిన ఆదాయం

జిల్లాలోని నాపరాయి పరిశ్రమల నుంచి ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రూ.12 కోట్లు, డీఎంఎఫ్ రూపంలో మరో రూ.1.20 కోట్లు, మెరిట్ రూపంలో మరో రూ.20 లక్షలు, ఇతర పన్నుల రూపంలో సంవత్సరాదాయం దాదాపు రూ.14 కోట్లు వచ్చేది. కానీ వైసీపీ విధానాల వల్ల ఈ ఆదాయం రూ.3 కోట్లకు పడిపోయింది. ఈ లెక్కన గత జగన్ ప్రభుత్వం జిల్లాలోని నాపరాయి పరిశ్రమను ఏ విధంగా నాశనం చేసిందో అర్థం చేసుకోవచ్చు. ఇక 'సంపద సృష్టిస్తాం.. అందరికీ పంచుతాం' అంటూ వచ్చిన కూటమి ప్రభుత్వం ఖజానాకు నష్టం చేకూర్చే విధానాలను పట్టుకుని ఎందుకు వేలాడుతోందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా మంత్రులు, కూటమి నాయకులు సీఎం చంద్రబాబు నాయుడికి వివరించి కన్సిడరేషన్ ఫీజు వసూలును నిలిపేయాలని పరిశ్రమ యజమానులు కోరుతున్నారు.

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం



నాపరాయి పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా దృష్టికి తీసుకెళ్లాను. గతంలో నాపరాయి పరిశ్రమకు ఇచ్చిన హామీలను కూడా వారికి గుర్తు చేశాను. దీనిపైన వచ్చే నెల మొదటి వారంలో గనుల శాఖ మంత్రి, ముఖ్య అధికారులతో చర్చలు జరిపి ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరించి నాపరాయి పరిశ్రమను ఆదుకుంటాం.

\- బీసీ జనార్దన్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి

పంటల బీమా ప్రీమియం గడువు పెంపు

రైతులకు మరో అవకాశం



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీలో పంటలు సాగు చేసిన రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పంటల బీమాకు చెల్లించే ప్రీమియం గడువు ఈ నెలాఖరు వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులు, రైతు సంఘాల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేంద్రం స్పందించింది. ప్రీమియం చెల్లించే రైతులు 50 శాతానికి పైగా ఉన్నారని గడువు పెంచాలని విజ్ఞప్తి చేయడంతో కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీ సీజన్‌లో అనేక వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు దెబ్బతినకుండా బీమా పొందే అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ప్రధానమంత్రి ఫసల్‌బీమా, వాతావరణ ఆధారిత బీమా కింద ప్రీమియం చెల్లించకుండా మిగిలిపోయిన రైతులకు ప్రయోజనం కల్పించాలని కోరింది. వరి, జొన్న, మినుము, వేరుశనగ, పొద్దుతిరుగుడు, పెసర పప్పుశనగ, మామిడి పంటలను బీమా పరిధిలోకి చేర్చింది. రుణం తీసుకున్న రైతులకు వారి తరఫున బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయి. మిగిలిన రైతులు ప్రీమియాన్ని ఈ నెలాఖరులోపు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు గురువారం వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయానికి చేరాయి. మొదటి పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించేందుకు వరికి మాత్రమే డిసెంబరు 31 వరకు మిగిలిన పంటలకు 15 వరకు మాత్రమే గడువు విధించారు. ఈ గడువు ఈనెలాఖరు వరకు పొడిగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి

రైతులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. ఈ నెలాఖరు వరకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులంతా తప్పనిసరిగా ఈ నెలాఖరులోగా వివిధ పంటలకు నిర్ణయించిన ప్రీమియంను వెంటనే చెల్లించాలి.

\- శాలురెడ్డి, ఏడీఏ

పంట	ప్రీమియం (హెక్టారు) రూ.లలో
శనగ	రూ.1,200లు
వరి	రూ.1,575
జొన్న	రూ.787.50
పెసర	రూ.675
మినుములు	రూ.712.50
వేరుశనగ	రూ.1,200
నువ్వులు	రూ.450
పొద్దుతిరుగుడు	రూ.750
మామిడికి	రూ.2,100 (ఎకరాకు)
టమోటా	రూ.2,100 (ఎకరాకు)

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

● రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, రైతుసంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా. బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అనుచిత వ్యాఖ్యలతో అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ, దళిత హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో కేంద్ర హోం శాఖ మంత్రిగా పదవులు అనుభవిస్తూ ఆ హక్కుల కల్పించిన అంబేద్కర్‌ను అవమానపరచడం దారుణమన్నారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆలోచనలు దేశ ప్రజలు గమనిస్తున్నారని, ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం అమిత్‌షా చిత్రపటాలను దహనం చేయడానికి సీపీఐ నాయకులు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, సీపీఐ నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి. రామక్రిష్ణారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, సమితి జిల్లా కార్యదర్శి మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

కర్నూల లీగల్: రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంటులో అవమానించిన ఘటనలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వై. జయరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పాతబస్టాండులోని బాబా సాహెబ్ అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాణంలో డా. అంబేడ్కర్ కృషి ఎనలేనిదని, హోం మంత్రి అంబేడ్కర్‌ను విమర్శించడం శోచనీయం అని ఆయన తెలిపారు.

● **ఐలూ ఖండన :** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ గురించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) కర్నూలు జిల్లా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కే. కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎస్. లక్ష్మణ్ ఒక ప్రకటనలో ఖండించారు. దేశ చరిత్ర తెలియని వ్యక్తులు అధికారంలో ఉంటే ఇటువంటి వ్యాఖ్యలే వినాల్సి వస్తుందని విమర్శించారు.

నేర పరిశోధనలో ప్రతిభ

జిల్లాకు ఏబీసీడీ అవార్డు

కర్నూలు క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేసుల పురోగతిలో కర్నూలు జిల్లా పోలీసులు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కేసుల విచారణలో విశేష ప్రతిభ చూపడంతో పాటు విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొస్తున్నారు. కేసుల పూర్వాపరాలు, కేసుల పరిష్కారంలో వినియోగించిన సాంకేతికత, వినూత్న విధానాలతో జిల్లా పోలీసులు సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలో అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్ (ఏబీసీడీ) అవార్డును దక్కించుకున్నారు. ఈ అవార్డును తాజాగా డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి ఎస్పీ బిందుమాధవ్ అందుకున్నారు.

● నిందితులను పట్టించిన డ్రమ్ము

జూలై 28వ తేదీన చిన్నహోతూరు సమీపంలో ఓ డ్రమ్ములో కుళ్లిపోయిన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తు ప్రారంభించిన సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆ తర్వాత సమీప పోలీస్‌స్టేషన్‌లో ఏమైనా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయా? అని ఆరా తీశారు. ఆ రెండు, మూడు రోజుల్లో ఎలాంటి కేసు నమోదు కాలేదని సమాచారం వచ్చింది. అయితే పోలీసులు మృతదేహాన్ని ఉంచిన డ్రమ్మును నిశితంగా పరిశీలించారు. డ్రమ్ముపై 'క్లారియంట్ ఐజీఎల్ స్పెషాలిటీ కెమికల్స్' అనే లేబుల్ ఉంది. ఈ లేబుల్‌ను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే.. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీ చెందిన డ్రమ్ముగా గుర్తించారు. ఆ కంపెనీ ప్రతినిధులను ఫోన్‌లో సంప్రదించి ఆ డ్రమ్ము వివరాలు ఆరా తీశారు. ఆ డ్రమ్ములు ఎక్కడెక్కడ సరఫరా చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఆ డ్రమ్ము హిందూపురం, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్లుగా వివరించారు. ఆ తర్వాత ఆలూరు వై. జంక్షన్ సర్కిల్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ సీసీ ఫుటేజీలో పసుపు రంగులో ఉన్న ఓ ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. దానిపై ఉన్న నెంబరు కనిపించలేదు. అయితే ఆ ఆటోకు టైర్లు విచిత్రమైన సింబల్స్‌తో ఉన్నాయి. మరో బృందం, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, బళ్లారి ఆలూరు తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలన్నింటినీ పరిశీలించారు. అదే సమయంలో మృతదేహం లభ్యమైన ప్రాంతంలో సెల్‌టవర్ డంప్, సెల్ సిగ్నల్స్ ఆధారంగా కొన్ని అనుమానాస్పద ఫోన్ నెంబర్లను గుర్తించారు. ఇలా సెర్చ్ చేస్తున్న క్రమంలో ఆదోనిలోని సీసీ ఫుటేజీలో ఆలూరు వై.జంక్షన్ సీసీ కెమెరాలో ఉన్న ఆటోను పోలిన విచిత్రమైన సింబల్స్‌లో ఉన్న టైర్ల ఆటోను గుర్తించారు. దానిపైన ఉన్న రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా ఆటో డ్రైవర్‌ను వెతికి పట్టుకున్నారు. తనకు ఆ డ్రమ్ములో ఏముందో తెలియదు అని. ఎవరో ముగ్గురు వ్యక్తులు వచ్చి కెమికల్ డ్రమ్ము అని చెప్పి ఆ డ్రమ్మును ఊరి చివరి పడేసి రావాలని ఆటోను బాడుగకు మాట్లాడుకున్నారని డ్రైవర్ వివరించాడు. దీంతో కేసు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్‌తో మాట్లాడిన సందర్భాలు సెల్ టవర్ డంప్‌ను కూడా పరిశీలించారు. ఆటో డ్రైవర్ వివరాల మేరకు ఓ మూడు సెల్ ఫోన్ నెంబర్లు కలిగిన వ్యక్తులు హాలేబీడు, తుమ్మలబీడు, సూగూరు ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్‌సాయంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించి వారే నిందితులుగా గుర్తించారు.

● డబ్బు కోసమే హత్య


సీసీ ఫుటేజీలో లభ్యమైన ఆటో (ఫైల్)

ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన పేటయ్య పొలం విక్రయించాడు. దానికి సంబంధించి కొంత నగదు పేటయ్యకు వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన నరసింహులు ఆ డబ్బులను కాజేయాలని ప్రణాళిక వేసుకున్నాడు. హోలేబీడుకు చెందిన హనుమంతు, పంపన్నల సాయం కోరాడు. జూలై 24న పేటయ్యను నమ్మించి ఆలూరు దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ అందరూ కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో విషగుళికలు వేసి పేటయ్యను హతమార్చారు. ఆ తర్వాత సమీపంలోని పొలం యజమాని సాయంతో పైపైనే శవాన్ని పూడ్చిపెట్టారు. రెండు రోజుల తర్వాత మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో పొలం యజమాని అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో అతనికి రూ.50వేలు ఆశ చూపి మరో రోజు సమయం తీసుకుని ఓ డ్రమ్ము తీసుకువచ్చి మృతదేహాన్ని గుంతలో నుంచి బయటకు తీసి డ్రమ్ములో వేశారు.


డ్రమ్ముల్లో మృతదేహం (ఫైల్)

జూలై 27వ తేదీ డ్రమ్మును జాగ్రత్తగా సీల్ వేసి ఓ ఆటోను మాట్లాడుకుని ఆస్పరి సమీపంలో చిన్నహోతూరు సమీపంలో ఆ డ్రమ్మును పడేసి వెళ్లిపోయారు.

● రెండు రోజుల్లో



పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహం కేసులో ఎలాంటి క్లూ లేకున్నా కూడా రెండు రోజుల్లో మా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కేసు ఛేదించడం అభినందనీయం. ఈ కేసులో నిందితులను పట్టుకున్న తర్వాత చనిపోయిన వ్యక్తి వివరాలు తెలిశాయి. సీఐ హనుమంతప్ప, సిబ్బంది ఈ కేసును ఛేధించడంలో ప్రధాన పాత్ర వహించారు. ఈ కేసు అవార్డుకు ఎంపిక కావడం భవిష్యత్తులో మరింత బాధ్యతను పెంచుతుంది. మున్ముందు అన్ని కేసుల్లో టెక్నాలజీని ఉపయోగించుకుని కేసులు ఛేధించేలా పూర్తి స్థాయి శిక్షణ కూడా ఇస్తున్నాం. సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటాం. ఈ కేసులో సీసీ కెమెరాలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

\- జి.బిందుమాధవ్, ఎస్పీ

ఓర్వకల్లులో సెమీ కండక్టర్ పరిశ్రమ

● రూ.14 వేల కోట్లతో మొట్టమొదటగా ఏర్పాటు
● 25-30 ఎకరాల్లో హైకోర్టు బెంచ్ ఐకాన్ భవనం
● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
● కలెక్టరేట్‌లో క్రిస్మస్ హై టీ కార్యక్రమానికి హాజరు



హైటీలో భాగంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో తొలి సెమీ కండక్టర్ పరిశ్రమ కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన క్రిస్మస్‌ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన హైటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఓర్వకల్లులో రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమ రావడం క్రిస్మస్ కానుక అన్నారు. ఆ పరిశ్రమ మన జిల్లాకు రావడం అనందంగా ఉందన్నారు. ఎక్కువగా చైనా, తైవాన్ వంటి దేశాల్లో ఈ పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపుతారని, తొలిసారిగా ఇండియాకు రావడం, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ఆ కంపెనీ ప్రతినిధులు నిర్ణయిస్తే.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో రాష్ట్రానికి వచ్చిందని అన్నారు. జనవరి రెండో వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సెమీ కండక్టర్ కంపెనీ ప్రతినిధులతో ఎంవోయూ కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. రెండు రెండున్నర ఏళ్లలో ఈ పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తులు ప్రారంభించేందుకు కంపెనీ ప్రతినిధులు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమ రావడంతో అనుబంధ పరిశ్రమలు కూడా వస్తాయని, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కర్నూలు హైకోర్టు బెంచ్‌కు ఐకాన్ భవనం నిర్మాణం చేస్తున్నామని, రాబోయే మంత్రివర్గం సమావేశం నాటికి హైకోర్టు బెంచ్ భవనం నిర్మాణం కోసం 25-30 ఎకరాలు సేకరించి తుది ఫైలుతో రావాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మానవాళికి క్రీస్తు జీవితం ఓ సందేశం అన్నారు. కలెక్టర్ పి. రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణ క్రీస్తు బోధనలని అన్నారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీస్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మతపెద్దలు, సీనియర్ పాస్టర్లు సహా నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్‌వో సి. వెంకటనారాయణమ్మ, పర్యాటక శాఖ డైరెక్టర్ ముంతాజ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దరూర్ జేమ్స్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సబీహాపర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను రెండు వారాల్లోపు పరిష్కరించాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు రెండు వారాల్లోపు పరిష్కారం చూపాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ సదస్సులు, హౌసింగ్, పంచాయతీ రాజ్, సీసీ రోడ్లు, పీఆర్ ఓన్ యాప్, తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు డివిజన్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 7వ తేదీన రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ, ప్రిన్సిపల్ సెక్రటరీలు రెవెన్యూ సదస్సులకు సంబంధించి తిరుపతిలో రీజినల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని, అంతలోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. రీజనల్ కాన్ఫరెన్స్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను కారణాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. జనవరి మొదటి వారంలో ముఖ్యమంత్రిచే లక్ష ఇళ్లను ప్రారంభించే కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హొళగుంద, మద్దికెర, చిప్పగిరి (యాస్పిరేషనల్ బ్లాక్స్) మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ పి. రంజిత్ బాషా జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయిల ఏర్పాటుకు ప్రత్యేక టెండరు పిలిచి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు త్వరగా పూర్తి చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఇన్‌చార్జి సీపీవో భారతి, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డీఈవో శామ్యూల్ పాల్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు, రాష్ట్రీయ స్వాస్థ్య కోఆర్డినేటర్ హేమలత, యాస్పిరేషనల్ బ్లాక్ కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ పెట్టండి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ, ఐఆర్‌పీల సహకారంతో వైద్య సదుపాయాలు అందించి ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాల ద్వారా శ్రద్ధ తీసుకోవాలని స్టేట్ ఐఈ కోఆర్డినేటర్ కల్పన పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏ. క్యాంపులోని ఆర్ట్ ఫౌండేషన్‌లో బడిబయట ఉన్న పిల్లల్లో ఇన్‌ఫ్లూ ఎడ్యుకేషన్‌పై మండల విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై శ్రద్ధ వహించి అవసరాలను తీర్చాలన్నారు. అవసరమైతే వారి తల్లిదండ్రులతో మాట్లాడి వైద్యసౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్ పాల్, ఐఈ కోఆర్డినేటర్ సురేష్ రాజు, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆరుగురు నిర్దోషులు

● 2001 కప్పట్రాళ్ల హత్య కేసులో
● ఆరుగురు ఖైదీలను నిర్దోషులుగా హైకోర్టు తీర్పు


కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు (ఫైల్)

దేవనకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇరవై మూడేళ్ల కిందటి ఆరుగురి హత్య కేసులో ఆరుగురు నిందితులను హైకోర్టు నిర్దోషులని తీర్పు చెప్పింది. 30.10.2001 సూర్యోదయం కంటే ముందు కప్పట్రాళ్లలో బాంబుల మోత వినిపించింది. దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు పాలేగారి వెంకటప్పనాయుడుపై హత్యయత్నం జరిగింది. గ్రామపంచాయతీ సమీపంలో వున్న వెంకటప్పనాయుడు ఇంటి చుట్టుపక్కల కళావతుల శేషు, పంద్ర, కృష్ణుడు, రాజు, మరో ఇద్దరు నీళ్ల కోసం వచ్చిన్నట్లు, పనులు చేసుకుంటున్నట్లు ఉండి, తన ఇంటి ఆవరణలో వాకింగ్ చేస్తున్న వెంకటప్పనాయుడుపై బాంబులతో దాడి చేశారు. ఈ దాడిలో వెంకటప్పనాయుడు గాయాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నాయుడు అనుచరులు దాడి చేసేందుకు వచ్చిన వారిని వెంబడించి దాడి చేయడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 25 మందిపై దేవనకొండ పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. ఆదోని కోర్టులో విచారణ నిమిత్తం కప్పట్రాళ్లకు చెందిన తిమ్మలు, గువ్వల రంగన్న, బోయ రాజు, రహిమాన్, రామాంజినేయులు, నర్సప్పపై 2012లో ఆదోని కోర్టు జీవిత ఖైదీ శిక్ష విధించింది. 2012 నుండి శిక్ష అనుభవిస్తున్న ఈ ఆరుగురిని 2020లో కరోన మహమ్మరి వ్యాప్తి చెందడంతో కండీషన్ బెయిల్‌పై సొంత గ్రామాలకు పంపారు. నాటి నుండి కండీషన్ బెయిల్‌పై గ్రామంలోనే ఈ ఆరుగురు ఉంటున్నారు. 2012లో శిక్షపడిన వెంటనే ఈ ఆరుగురు హైకోర్టులో అప్పీలు చేశారు. 11 ఏళ్ల తరువాత, మూడు నెలల క్రితం హైకోర్టులో కేసు విచారణ మొదలైంది. శుక్రవారం ఆరుగురుని నిర్దోషులుగా హైకోర్టు తీర్పు ఇచ్చింది.

ఆదోని మార్కెట్ యార్డుకు సొబగులు

(5వ పేజీ తరువాయి)

వర్షపు నీరు తడవకుండా రూ.14.80 కోట్లతో కవరు షెడ్డు

పాత వేరుశనగ ప్లాట్‌ఫాం లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం వచ్చిన ప్రతిసారి ప్లాట్‌ఫాంపై రైతులు టెండర్లు ఉంచిన దిగుబడులన్నీ ఆ వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయి. ప్రధానంగా డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం ప్లాట్‌ఫాం రోడ్డుకు కంటే తక్కువ ఎత్తు ఉండడం వల్ల రైతులు వర్షపు నీరు చేరి ఆనీటిలో దిగుబడులు కొట్టుకుపోయి నష్టపోతున్నారు. ఇలా జరగకుండా దిగుబడులు రక్షణగా పూర్తిగా కవర్డ్‌షెడ్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి రూ.14.80 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆమోదం తెలిపిన రైతుకు కష్టాలు తీరినట్టే.



ప్రతిపాదించిన పనులు ఇవే...

● అదనపు డ్రైనేజీల నిర్మాణానికి రూ. 70 లక్షలు
● వేరుశనగ యార్డు దుకాణాల ముందు షట్టర్లకు గట్టర్లకు ఏర్పాటు చేసి నీరు బయటకు వెళ్లేందుకు రూ.20 లక్షలు
● మార్కెట్ యార్డ్ అంతా అన్ని ప్లాట్‌ఫాంలలో ఉన్న రైతుకు తాగు నీరు ఇబ్బందులు పడకుండా తాగునీటి సరఫరాకు రూ.10 లక్షలు
● అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు
● పాత యార్డులో దిగుబడుల వర్షపు నీటి రక్షణగా రూ.14.80 కోట్లు కవర్డ్ షెడ్ నిర్మాణం
● కార్యాలయ భవన సముదాయ నిర్మాణానికి రూ.5 కోట్లు
● రైతు విశ్రాంతి భవనం నిర్మాణానికి రూ. 25లక్షలు
● మొత్తం అన్ని పనులకు రూ.21.40 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు తయారు చేసి పంపారు.

● మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి



ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. మార్కెట్ యార్డు కొచ్చిన రైతులకు తూకాలు, క్రయవిక్రయాలు, చెల్లింపులోనూ పారదర్శకత ఉంటుందన్న నమ్మకం. అలాంటి వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. తాగునీరు దగ్గర సదుపాయాలన్నీ కల్పిస్తాం.

\-రామ్మోహన్ రెడ్డి, ఎంపిక కార్యదర్శి మార్కెట్ యార్డు, ఆదోని

● మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆమోదం తెలిపిన వెంటనే పనులు



రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు మార్కెట్ యార్డ్‌లో మౌలిక వసతులు కల్పనకు రూ. 20.48 కోట్లు అవసరమవుతుందని ప్రతిపాదనలు వివేదికను అందజేశాం. కమిషనర్ మార్కెట్ యార్డులో పర్యటించి అవసరాలను గుర్తించారు. ప్రతిపాదనలకు నిధులు కేటాయించిన వెంటనే టెండర్లను పిలిచి పనులు చేపడతాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలన్నీ కల్పిస్తాం.

\- సుబ్బారెడ్డి, డీఈ, ఆదోని

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అమిత్ షా వ్యాఖ్యలు సరికాదు



నందికొట్కూరులో అమిత్ షా ఫొటోలను దహనం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) నాయకులు

- అంబేడ్కర్‌ను అవమానిస్తే రాజ్యాంగాన్ని అవమానించినట్లే
- మంత్రి వర్గం నుంచి తొలగించాలి
- సీపీఐ (ఎంఎల్), సీపీఎం నాయకుల డిమాండ్

నందికొట్కూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆయనను మంత్రి వర్గం నుంచి తొలించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న నరసింహారెడ్డి సర్కిల్లో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు అమిత్ షా ఫొటోలను దహనం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమిత్‌షా దేశ ప్రజలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా నాయకులు ఎస్‌బీవీవీ లక్ష్మీదేవి, నాయకులు షేక్షావలి, సోమన్న, మస్తాన్‌వలి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి ఎగతాళిగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం పగిడ్యాలలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించడమంటే రాజ్యాంగాన్ని అవమానించినట్లే నని అన్నారు. కార్యక్రమంలో ఉసేనమ్మ, బాబు, తిక్కస్వామి, పక్కీరయ్య, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



పగిడ్యాలలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

'జయప్రదం చేయండి'

ఆత్మకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భావమై వందేళ్ల పూర్తయిన సందర్భంగా డిసెంబరు 26వ తేదిన నిర్వహించే వందేళ్ల ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఆత్మకూరు తాలుకా కార్యదర్శి ప్రతాప్, ఏఐటీయూసీ నాయకులు చాంద్‌బాషా, లల్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బీసన్న పిలుపునిచ్చారు. ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ వందేళ్ల చరిత్రతో కూడిన బుక్ లెట్‌లను వారు ఆవిష్కరించారు.

'పనుల్లో నాణ్యత పాటించాలి'



తాటిపాడులో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

జూపాడుబంగ్లా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పనుల్లో నాణ్యత పాటించాలని, తిలోదకాలు ఇస్తే ఉపేక్షించేది లేదని ఎంపీడీవో గోపృకృష్ణ అన్నారు. మండలంలోని తాటిపాడు గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదని ఫిర్యాదు వస్తున్నాయని, విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సచివాలయం తనిఖీ చేసి సిబ్బందిని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రం, చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిప్పన్న పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటు

మిడుతూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో నివాసం ఉంటున్న డోలు నారాయణ సతీమణి లక్ష్మీదేవమ్మ సౌజన్యంతో మిడుతూరులో రూ.50 వేలు విలువ చేసే 15 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారి బంధువులు తెలిపారు. ఈ బెంచీలను ప్రజల సౌకర్యం కోసం గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి, వాల్మీకి ఆలయాల వద్ద, చర్చి వద్ద, బస్టాండు ఆవరణంలో ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు.

'నైపుణ్య సామర్థ్యాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యం'



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు

పాములపాడు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యతను పెంపొందిచడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ నాయకులు ఆళ్ళగడ్డ హరిసర్వోత్తమ రావు అన్నారు. శుక్రవారం పాములపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, వారిలో నైపుణ్య తను పెంపొందించేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. టీడీపీ అధికార పగ్గాలు చేపట్టాక ఇంటర్ విద్యార్థు లకు మధ్యహ్న భోజన పథకం అందించడం అభినందనీయమని అన్నారు. కళాశాల సిబ్బంది, టీడీపీ నాయకులు షేక్ నబిరసూల్, మల్లికార్జున, మద్దిలేటి, లింగస్వామి, జలాల్‌బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

'అధిక ధరకు విక్రయిస్తే చర్యలు'

వెలుగోడు డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, పురుగుల మందులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి పవన్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలోని సాయి లక్ష్మి, వీరబ్రహ్మేంద్ర స్వామి దుకాణా లను ఆయన అకస్మిక తనిఖీ నిర్వహించారు. నిల్వలను, రికార్డు లను పరిశీలించారు. వీర బ్రహ్మేంద్ర ఫర్టిలైజర్ దుకాణంలో రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించక పోవడంతో రూ.4 లక్షలు విలువ చేసే పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు అధికారి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రామకృష్ణ, నాగలింగం పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

పాణ్యం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ జూటూరుకు చెందిన మోహన్‌బాబుపై అదే గ్రామానికి చెందిన మహేష్ అలియాస్ బొంబాయి కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలివీ... ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం పెద్దకర్మకు వెళ్తూ పెద్దకర్మకు సంబంధించిన వస్తువులను మహేష్ అనే వ్యక్తి మోహన్‌బాబు ఇంటి వద్ద పెట్టాడు. దీంతో మోహన్‌బాబు మహేష్‌ను దండించాడు. ఇది మనసులో ఉంచుకున్న మహేష్ అదే రోజు రాత్రి మోహన్‌బాబుతో ఘర్షణకు దిగి కత్తితో గాయపరిచాడు. దీంతో మోహన్‌బాబును నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహేష్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

పత్తి విత్తనశుద్ధి కేంద్రాల తనిఖీ



పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న డీఏవో మురళీకృష్ణ

నంద్యాల రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పలు ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. భవ్య సీడ్స్, బబ్బూరి ఆగ్రో ఇండస్ట్రీస్ ఆయన తనిఖీ చేసి రిజిస్టర్లు, కంపెనీ స్టాక్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అనుమతి పొందిన కంపెనీల పత్తి విత్తనాలను మాత్రమే ప్రాసెసింగ్ చేయాలన్నారు. నిల్వలను కంపెనీ వారిగా రిజిస్టర్ నిర్వహించాలన్నారు. వ్యర్థాలను ఈటీపీ విధానం ద్వారా శుద్ధి చేయాలన్నారు. శుద్ధి చేశాక ఆ నీటిని పొలాలకు వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'

నంద్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘానికి తక్షణమే కమిషనర్‌ను నియమించాలని, కమిషనర్ నివేదిక సమర్పించేలోగా 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు 57 ప్రకారం పాత పెన్షన్‌ను వర్తింపజేయాలన్నారు. పాఠశాల విద్యలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ జీవోలు 72, 73, 74 అమలు చేస్తూ జూనియర్ కాలేజీ, డైట్ కాలేజీ లెక్చరర్ల పదోన్నతులు, పాఠశాల సహాయకుల ద్వారా, ఉప విద్యాశాఖ అధికారుల పోస్టులను సీనియర్ హెచ్ఎంలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అదనపు కార్యదర్శి పుల్లయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు జయరాం, గోపాల్‌రావు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నందికొట్కూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): దివంగత న్యాయవాది వెంకటరెడ్డి ఇంటి వద్ద పట్టణానికి చెందిన నిర్మల అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పట్టణంలోని సంగయ్యపేటలో నివసిస్తున్న నిర్మలకు దివంగత లాయర్ వెంకటరెడ్డి డబ్బులు అప్పుగా తీసుకున్నారని, ఆ డబ్బులను ఆయన కుటుంబ సభ్యులు తనకు ఇవ్వాలంటూ సంగయ్య పేటలోని లాయర్ ఇంటి ముందు పురుగుల మందు తాగారు. పోలీసులు చికిత్స నిమిత్తం ఆమెను నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పట్టుదలతో ఉద్యోగానికి సిద్ధమవ్వాలి: డీఎస్పీ



ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): యువత పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం కావాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆత్మకూరు అర్బన్ సీఐ డి.రాము సహకారంతో కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా శిబిరాన్ని శుక్రవారం డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాలను దక్కించుకోవడం సులభం కాదని అన్నారు. యువతకు ఉద్యోగాల పట్ల శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. కాగా సీఐ రాము తన సొంత ఖర్చులతో 100 మీటర్లు, 1600 మీటర్లు, లాంగ్ జంప్ ట్రాక్‌లను ఏర్పాటు చేయించడంతో పాటు దేహదారుఢ్య పరీక్షల్లో రాణించిన వారికి ఉచితంగా మెయిన్స్ శిక్షణ ఇప్పించేందుకు ముందుకు రావడం పట్ల పలువురు ఆయనను ప్రశంసిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నారాయణరెడ్డి, హుసేన్‌బాషా, ఫిజికల్ డైరెక్టర్లు శంకర్, దేవానంద్, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పేల్ మున్నా తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే: ఎస్పీ

నంద్యాల క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కార కోసం గ్రీవెన్స్‌డే నిర్వహించినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో ఎస్పీ సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 9మంది పోలీస్ సిబ్బంది ఎస్పీని కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సిబ్బంది సమస్యలు విన్న ఎస్పీ వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతానని భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యమిస్తూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది సమస్యలను నిర్భయంగా తెలియజేయవచ్చని తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమతమవకుండా వారి సమస్యలు తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చేయడమే లక్ష్యమని ఎస్పీ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాణ్యం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిలకల 33 కేవీ విద్యుత్ లైను మరమ్మతుల కారణంగా మండలంలోని వాణిజ్య, గృహ, పరిశ్రమల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సర ఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా రైల్వే ట్రాక్ పనులు

పాణ్యం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పాణ్యం వద్ద రైల్వే ట్రాక్ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు రైల్వే శాఖ ఇంజనీరు వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం పాణ్యం రైల్వే స్టేషన్‌నుంచి క్రిష్ణమ్మకోనవైపు రెండో రైల్వే మార్గ పనులను వేగవంతంగా చేస్తున్నట్లు నిర్మాణ పనుల సందర్భంగా రైల్వే గేటును రెండు రోజులపాటు మూసివేసినట్లు తెలిపారు. ఇందుకోసం బనగానపల్లె, నంద్యాల ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ప్రయాణించకుండా చర్యలు చేపట్టామన్నారు. శనివారం సాయంత్రం వరకు పనులు జరుగుతాయని, వాహనదారులు, ప్రయాణికులు సహకరించాలని అన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు: ఆర్డీవో



మంచాలకట్టలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో

గడివేముల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో విశ్వనాథ్ అన్నారు. మండలంలోని మంచాలకట్ట గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులకు హాజరయ్యారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయోగపడతాయని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. తూడిచర్ల గ్రామంలో సర్పంచ్ బాలమద్దిలేటి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. డీటీలు సత్యదీప్, నాగన్న, వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్(ఆంధ్రజ్యోతి): పిన్నాపురం గ్రామంలో తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అంజనేయులు, ల్యాండ్ సర్వే అధికారి రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

నంద్యాల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గడ్డం చెన్నయ్య(65) మృతికి పలువురు సంతాపం తెలిపారు. టీడీపీ నాయకురాలు శంకరమ్మ మాట్లాడుతూ చెన్నయ్య మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. అంత్యక్రియలకు శంకరమ్మ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

'సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి'



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వెలుగోడు డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం చేపట్టిన ఎంఎస్ఎం ఈ సర్వే, జియో ట్యాగింగ్‌లను పకడ్బందీగా, వేగవంతంగా సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే ఆయా గ్రామాలలోని సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పీఎస్ సుంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ



స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామ పూజలు, పూజలు నిర్వహించి మంగళ హారతులు సమర్పించారు.

● శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు.

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహానందిలో శుక్రవారం రాత్రి ఆలయ వేదపండితులు, అర్చకులు పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక అలంకరించిన పల్లకిలో మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆశీనులుజేశారు. వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మెదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం



అష్టోత్తర శత కలశాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం పురష్కరించుకొని నంద్యాల సంజీవనగర్ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో వేంకటేశ్వరస్వామికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్ శర్మ, తరుణ్‌కుమార్ శర్మ వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు అనంతరం 108 కలశాలు పెట్టి వాటిలో సుగంధ ద్రవ్యాలు నీరు, పాలు నింపి అర్చకులు వేదమంత్రాలతో ఆ కలశాలకు పూజ నిర్వహించి ఆ కలశాలలోని నీటితో వేంకటేశ్వరస్వామికి అభిషేకం, అలాగే విశేష పుష్పాభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం ఇటువంటి సేవలు శ్రీవారికి చేయడం ఎంతో మంచిదని డాక్టర్ దివి హయగ్రీవాచార్యుల విశ్లేషణతో, అర్చకులు గోవిందనామాలతో, వేదవచనాలు, మంత్రపుష్పం, వేద ఆశీర్వాదంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు శ్రీనివాస్, పార్థసారధిక్రిష్ణ, భక్తులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తుడు విరాళాన్ని అందించారు. ఎంవీ అభిలాష్ కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా కలిసి రూ.1,00,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

'ఇంధన పొదుపుతో భావి తరాలకు వెలుగు'

నంద్యాల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటి ఇంధన పొదుపు రేపటి భావితరాలకు వెలుగును ఇస్తుందని, అందరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని పట్టణ విద్యుత్ డీఈఈ రమేష్‌కుమార్ సూచించారు. నంద్యాలలోని ఎన్‌జీవోస్ కాలనీ మున్సిపల్ పాఠశాలలో జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలలో భాగంగా డీ2 ఏఈ రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డీఈఈ మాట్లాడుతూ మనకున్న వనరులను సద్విని యోగం చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాటి పర్యావసానాలు ఎంతో క్లిష్ట తరంగా ఉంటాయన్నారు. ఇందన పొదుపు మీరూ పాటిస్తూ ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్‌తో పాటు ఇతర వనరులను ఉపయోగించుకునే విధానాలను వివరించారు. పోటీలలో విజేతలకు నేడు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. హెచ్ఎం డీ1 ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం: ఈవో



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులకు, సిబ్బందికి పిలుపునిచ్చారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహకారంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది అంతా కృషి చేయాలన్నారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్ల గురించి సంబంధిత ఆయా విభాగాధిపతులతో కూలంకషంగా చర్చించి పలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా వైదిక సిబ్బంది, ఆలయ విభాగాధిపతులు పరస్పర సమన్వయంతో ఉత్సవ కార్యక్రమాలు, స్వామి, అమ్మవార్ల కైంకర్యాలన్నీ ఎలాంటి లోటు లేకుండా సంప్రదాయబద్ధంగా జరిపించాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి విభాగం కూడా యాక్షన్ ప్లాన్ రూపొందించి కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా ఏర్పాట్లను వెంటనే చేపట్టాలన్నారు. ఉత్సవాల్లో నిర్వహించాల్సిన వైదిక కార్యక్రమాలు, వాహన సేవలు, స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ, ఆలయ వేళలు, దర్శనం ఏర్పాట్లు, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర వాటిపై చర్చించారు. పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు అటవీశాఖ అధికారుల సహకారంతో ఆయా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బందోబస్తు, వసతి, వైద్య సదుపాయం, క్షేత్రపరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య చర్యలు, సౌచాలయాల ఏర్పాట్లు, పాతాళగంగ వద్ద ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, సూచికబోర్డుల ఏర్పాటు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. దేవస్థానం యూనిట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, దేవస్థానం అన్ని విభాగాల అధిప తులు, పర్యవేక్షకులు, తహసీల్దార్ కేవీ శ్రీనివాసులు, అటవీశాఖ రేంజ్ అధి కారి సుభాష్‌రెడ్డి, మండల ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు డాక్టర్ ఆర్.శ్రీవాణి, దేవస్థానం వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న అపోలో వైద్యులు డాక్టర్ టి.శశిధర్, ఏఎస్ఐ బీసీ గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

కించపరచడం సరికాదు



బనగానపల్లెలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను కేంద్రహోం మంత్రి అమిత్‌షా వెనుకకు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి అధ్యక్షతన పట్టణంలోని బస్టాండ్ ఆవరణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనే దురుద్దేశంతో ప్రధాని మోదీ, మంత్రి అమిత్‌షా వ్యవహరిస్తున్నారని అన్నారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంజీవలు, శివబాలకృష్ణ, శివయ్య, సుబ్రమణ్యం, బాలసంజీవులు, పైలట్ మాబూసా, ఎర్రన్న రామకృష్ణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రతి రైతు శాస్త్రవేత్త కావాలి


చిన్నవంగలిలో నన్నారి మొక్కలను పరిశీలిస్తున్న రాష్ట్రీయ శాస్త్రవేత్తలు

చాగలమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఒక శాస్త్రవేత్త కావాలని తూర్పుగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెం ఉద్యానవన యూనివర్సిటీ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.రంగన్న తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నవంగలి గ్రామంలో రైతులు సాగు చేసిన నన్నారి తోటలను పరిశీలించారు. రైతులు సాగు చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నాగ లక్ష్మి, ఆదర్శ, వీహెచ్‌ఏ శ్రావణి, రైతులు ఉన్నారు.

గౌరవప్రదంగా జీవించాలి


మాట్లాడుతున్న పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా

డోన్ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ హక్కుల గురించి తెలుసుకుని సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ గౌరవప్రదంగా జీవించాలని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా సూచించారు. పట్టణంలోని హ్యాండ్స్ కార్యాలయంలో హ్యాండ్స్ ప్రాజెక్టు మేనేజర్ మణికుమార్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు ట్రాన్స్‌జెండర్లను సన్మానించారు. కార్యక్రమంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్, హ్యాండ్స్ సిబ్బంది పుష్పరాజు, సరస్వతి, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు

చాగలమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 17 మండలాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించామన్నారు. చాగలమర్రి మండలంలో 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ విచారణలో రూ.8.40 లక్షలు అవినీతి జరిగిందన్నారు. ఉపాధి నిధులు దుర్వినియోగం చేసిన ఉపాధి సిబ్బంది, సంబంధిత అధికారుల ద్వారా రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ మురాద్, ఏపీవో నిర్మల, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చాగలమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో పేకాట ఆడుతుండగా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.91,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు. శుక్రవారం స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అరెస్టు చేశారు. వీరిని ఆళ్లగడ్డ కోర్టులో హాజరుపరిచామన్నారు. దాడిలో ఏఎస్ఐ నబీ సాహెబ్, పోలీసులు ఉన్నారు.

ఏపీపీగా బాధ్యతల స్వీకరణ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ 5వ అదనపు జిల్లా కోర్టులో ఏపీపీగా (అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్) బత్తిన శివప్రసాద రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కోర్టులోని పలువురు న్యాయవాదులు ఏపీపీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

పాడి రైతులపై మరింత భారం

- వరి గడ్డికి పెరిగిన గిరాకీ
- ట్రాక్టరు గడ్డి రూ.10 వేల నుంచి రూ.15 వేలు
- పెద్దఎత్తున అనంతపురం జిల్లాకు తరలింపు
- సబ్సిడీపై పంపిణీ చేయాలంటున్న అన్నదాతలు


వరి గడ్డిని అనంతపురం జిల్లాకు తరలిస్తున్న పాడి రైతులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభం కావడంతో పశువుల మేతకు వినియోగించే వరిగడ్డిని పాడి రైతులు పెద్దఎత్తున్న కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు విస్తీర్ణం తగ్గడంతో ఈ ఏడాది గడ్డికి గిరాకీ పెరిగింది. ఒక ట్రాక్టరు వరి గడ్డి రూ.10వేల నుంచి రూ.15వేలు పలుకుతున్నట్లు పాడి రైతులు తెలుపుతున్నారు. అసలే అంతంతగా ఉన్న పాడి పరిశ్రమపై పశుగ్రాసం భారం పడటం మరింత కష్టతరమైనట్లు అన్నదాతలు వాపోతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వరి గడ్డి పెద్ద ఎత్తున అనంతపురం జిల్లాకు తీసుకెళ్తున్నారు. ప్రతి రోజూ 50నుంచి 100 ట్రాక్టర్ల గడ్డి కొలిమిగుండ్ల మండలం మీదుగా సరిహద్దులు దాటుతోంది. అవుకు, బనగానపల్లె తదితర ప్రాంతాల నుంచి వరి గడ్డి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో వరి గడ్డికి గిరాకీ పెరిగింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాసం పంపిణీ చేసేది. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో ఉత్తర రాష్ట్రాల నుంచి సైతం పశుగ్రాసాన్ని తెప్పించి, రాయితీపై పాడి రైతులకు అందించారు. అయితే గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సబ్సిడీ పశుగ్రాసం పంపిణీ నిలిపివేసింది. దీంతో పాడి రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున సబ్సిడీ పశుగ్రాసం తిరిగి అందించాలని రైతులు కోరుతున్నారు.

బైటిపేటలో నీటి వివాదం

- బోరు నీటి మళ్లింపును అడ్డుకున్న మహిళలు

బేతంచెర్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైటిపేటలో నీటి వివాదం చెలరేగింది. తాగునీటి బోరు నుంచి మరొక ట్యాంకుకు సంబంధించిన పైపులైన్ ఏర్పాటు చేయడాన్ని స్థానికులు శుక్రవారం అడ్డుకున్నారు. మరొక ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వడాన్ని ఒప్పుకోబోమని మహిళలు గట్టిగా నిలదీశారు. నగర పంచాయతీ పరిధిలోని బైటిపేటలో ఉన్న నీటి బోరు 24 గంటలూ పని చేయడంతో కాలనీకి ఎలాంటి తాగునీటి సమస్య లేదని మహిళలు అధికారులకు వివరించారు. ఈ బోరు నుంచే మినరల్ వాటర్ ప్లాంటుకు పైపులైన్ కనెక్షన్ ఇస్తామని చెప్పడం సరికాదని, అలా చేయడం వల్ల తమకు ఇబ్బందులు నీటి తలెత్తుతాయని అధికారుల దృష్టికి తెచ్చారు. విషయం తెలుసుకున్న కమిషనర్ హరిప్రసాద్, టీడీపీ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మహేష్ బాబు అక్కడకు చేరుకుని ఇక్కడి నుంచి పైపులైన్ ద్వారా వాటర్ ప్లాంటుకు కనెక్షన్ ఇవ్వడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. వీలైతే పది రోజుల్లో మరొక బోరు ఏర్పాటు చేస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికీ మహిళలు వినకపోవడంతో టీడీపీ నాయకుడు భీమేశ్వరరెడ్డి అక్కడకు చేరుకుని మినరల్ వాటర్ ప్లాంటుకు ఇక్కడి నుంచే పైపులైన్ కనెక్షన్ ఇస్తామని చెప్పడం ఉద్రిక్తతకు దారితీసింది. మరో బోరు వేయిస్తానని భీమేశ్వరరెడ్డి చెప్పగా అవసరం లేదని, కాలనీవాసులమంతా కలిసి సొంతంగా బోరు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సమస్యను సృష్టించడమే అధికార పార్టీ నాయకుల నైజమా అంటూ మహిళలు వెనుదిరిగి వెళ్లారు. బైటిపేటలో ఉన్న బోరు నుంచి వేరొక బోరుకు కనెక్షన్ ఇవ్వరాదంటూ అడ్డుపడిన మహిళలకు టీడీపీ సీనియర్ నాయకురాలు పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి సర్దిచెప్పడానికి వెళ్లారు. టీడీపీ నాయకుడు భీమేశ్వరరెడ్డి తమ కాలనీలోకి మీరెవరు రావడానికి అని అనడంతో ఆమె అక్కడి నుంచి ఆమె వెళ్లిపోయారు. ఈ విషయమై నగర పంచాయతీ కౌన్సిలర్లు విచారించగా తమ ఆమోదం లేదనిదే ఎలా చేస్తారని చెప్పడం గమనార్హం.


మహిళలతో మాట్లాడుతున్న టీడీపీ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, కమిషనర్, పోలీసు అధికారులు

గ్రామాల్లో మోస్తరు వర్షం

- తడిసిన వరి, మినుము, జొన్న పంటలు
- నష్టపోయామంటూ రైతుల ఆవేదన


తడిసిన వరి ధాన్యాన్ని బస్తాలకు నింపుకుంటున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో శుక్రవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. 8.11 మీ.మీ వర్షపాతం నమోదైంది. శెట్టివీడు, మద్దూరు, కలుగొట్లపల్లె తదితర గ్రామాల్లో 500 ఎకరాలు దాక జొన్న పంట నేలవాలింది. శెట్టివీడు, చాగలమర్రి, ముత్యాలపాడు గ్రామాల రహదారులలో, పంట పొలాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిచి దెబ్బతింది. ధాన్యంపై పట్టలు కప్పినా వాటిపై వర్షపు నీరు నిలిచింది. ఆ నీటిని తొలగించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. కొందరు రైతులు వర్షంలోనే వరి ధాన్యాన్ని సంచులకు నింపి ట్రాక్టర్ల ద్వార గృహాలకు తరలించుకున్నారు. పంట పొలాల్లో నూర్పిడి చేసేందుకు కోతలు కోసి కుప్పలుగా పోసిన మినుము, నువ్వు కట్టె తడిచి దెబ్బతింది. పప్పుశనగ నల్లబారి కుళ్లిపోతుందని రైతులు ఆవేదన చెందారు. రెండు విడతలుగా తుఫాన్ ప్రభావంతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు కన్నీటితో విలపించారు. తడిచిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రుద్రవరం : తుఫాను ప్రభావంతో మేఘాలు కమ్ముకుని చినుకులు రాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం మండలంలో రుద్రవరం కొండమాయపల్లె, కొత్తూరు గ్రామాల సమీపంలో చినుకులు రాలాయి. రైతులు ఆందోళన పడి వరి ధాన్యం కుప్పలపై పట్టలు కప్పారు. చేతికందిన వరి ధాన్యం దెబ్బతింటుందని రైతులు ఆందోళన పడుతున్నారు.

కాలుష్యం నుంచి కాపాడాలి

కొలిమిగుండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం నుంచి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల రామ్‌కో సిమెంట్ పరిశ్రమ సమీపంలోని పంట పొలాలను రెవెన్యూ, వ్యవసాయ, కాలుష్యం శాఖల అధికారుల బృందం పరిశీలించింది. ఈసందర్భంగా రైతులు కాలుష్య నియంత్రణ అధికారి రామకృష్ణ తీరుపై రైతులు మండిపడ్డారు. గతంలో ఆనేక మార్లు కాలుష్య నియంత్రణ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని రైతులు గూడూరు నాగేశ్వరరెడ్డి, పుల్లయ్య, గుజ్జల పెద్దయ్య, గూడూరు మహేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి శరత్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్‌కో పరిశ్రమ వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ము వల్ల పంటలు నాశనం అవుతున్నాయని వాపోయారు. అనంతరం తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలమేరకు పంటలు పరిశీలించామని క్షేత్రస్థాయి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి భూమా జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


కాలుష్య నియంత్రణ అధికారితో మాట్లాడుతున్న రైతులు

భూ సమస్యలు పరిష్కరించుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న కోవెలకుంట్ల తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుని భూమసస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని వల్లంపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ భూమసస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా పొలం తగదాల విషయంలో గొడవలు పడి కుటుంబాలు నాశనం చేసుకోవద్దన్నారు. తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తావన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, మండల సర్వేయరు వీరన్న, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్యాపిలి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూసమస్యల అర్జీలను 45రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దారు భారతి తెలిపారు. శుక్రవారం మండలంలోని జలదుర్గం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి భూసమస్యలు ఉన్నా వినతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె: మండల కేంద్రంలో తహసీల్దారు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అర్జీలను పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఆర్ఐ రాఘవేంద్ర, వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చాగలమర్రి: భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్తార్, సర్వేయర్ మద్దిలేటి, వీఆర్వోలు శ్రీనివాసులు, శిఖామణి, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండలంలో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులకు రైతులు, ప్రజల నుండి స్పందన కరువైంది. శుక్రవారం మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో తహశీల్దార్ బాలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ రైతుల నుండి కేవలం 7దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. రెవిన్యూ సదస్సులపై ప్రజలకు సరైన సమాచారం, అవగాహన లేకపోవడం, పిర్యాదు చేసినా సమస్యలకు పరిష్కారం లభించదు అనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడటమే దీనికి కారణమని పలువురు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సరిత, టీడీపీ నాయకులు అంబటి జయలక్ష్మిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

చాగలమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సెయింట్‌ఆన్స్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలను హెచ్‌ఎం స్మిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రిస్మస్ నాటిక అందరిని ఆకట్టుకుంది. కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సెయింట్ ఆన్స్ పాఠశాల ఆవరణలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పది పరీక్షలపై ప్రత్యేక కసరత్తు

- ఎంఈవో అబ్దుల్‌కలాం



కొలిమిగుండ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కీలకమైన పదవ తరగతి పరీక్షలపై ప్రత్యేక కసరత్తు ప్రారంభించామని మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని ఉన్నత పాఠశాలలు ఎన్ని ఉన్నాయి..? మొత్తం పదవ తరగతి విద్యార్థుల సంఖ్య ఎంత..?

జవాబు: మండలంలో పది ఉన్నత పాఠశాలలతో పాటు, మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. 12పాఠశాలల్లో మొత్తం 575 మంది విద్యార్థులు పదవతరగతి విద్యనభ్యసిస్తున్నారు.

ప్రశ్న: పదవతరగతికి సంబంధించి ప్రత్యేక తరగతుల నిర్వహణ ఎలా సాగుతోంది?

జవాబు: పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. ఉదయం 8గంటల నుంచి 9వరకు, సాయంత్రం 4నుంచి 5గంటల వరకు ప్రత్యేక క్లాసుల నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: వెనుకబడిన విద్యార్థులపై ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది?

జవాబు: విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక జాగ్రత్తలు చేపడుతున్నాం. కొంత మంది ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ నిర్వహించి, ముందుకు వెళ్లేలా ప్రయత్నం సాగిస్తున్నారు.

ప్రశ్న: మధ్యాహ్న భోజనం అమలుతీరు ఎలా ఉంది?

జవాబు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, నూతన మెనూతో నాణ్యమైన భోజనం అందిస్తున్నాం.

ప్రశ్న: విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎలా ఉంది?

జవాబు: తల్లిద్రండులు విద్యార్థులను పాఠశాలకు పంపడంతోనే తమ పని అయిపోయిందనుకోకూడదు. ఇంటి వద్ద ద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. క్రమశిక్షణతో మెలిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంటుంది.

రైతులకు రశీదులు ఇవ్వాలి

కోవెలకుంట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేసిన వాటికి డీలర్లు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీబస్టాండు సమీపంలోని పురుగు మందుల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టరు, బిల్లు బుక్కులు పరిశీలించి కొన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రైతులు సాగు చేసిన వేరుశనగ, జొన్న, మినుము, వరి పంటలకు ఇన్సురెన్స్ చేయించుకోవాల న్నారు.

నేడు స్వచ్ఛ కోవెలకుంట్ల

కోవెలకుంట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీ పరిధిలో నెలలో మూడో శనివారం స్వచ్ఛ కోవెలకుంట్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ, ఈవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు రోడ్లు శుభ్రం చేయడం, ప్రజల్లో బహిరంగ మల విసర్జనపై అవగాహన కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు మహిళా సంఘాలు విద్యార్థులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజనం పునరుద్ధరణపై హర్షం

డోన్ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడంపై టీడీపీ పట్టణ యువ నాయకులు వై.హనుమంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 475 జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన అమలుకు మంత్రి మండలి ఆమోదించడం హర్షణీయమన్నారు. రష్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల ఉపాధ్యాయులను కోరారు. స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో జరుగుతున్న ఎస్‌ఏ-1పరీక్షలను పరిశీలించారు. పది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌వో సునీత, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

చెంచుగూడేల్లో మౌలిక వసతులపై సర్వే

రుద్రవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెంచుగూడెల్లో మౌలిక వసతులపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణం తెలిపారు. శుక్రవారం హరినగరం, చెంచుగూడెం, చిన్నయ్యస్వామి చెంచుగూడెల్లో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, కొళాయిలు లేని ఇళ్లను గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరసింహవర్మ, మౌనిక ఉన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

ఉయ్యాలవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సంచార వాహనం ద్వారా గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పెద్దయమ్మనూరు గ్రామ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి శివలింగమ్మ తెలిపారు. శుక్రవారం కాకరవాడ గ్రామంలో 104 వాహనం ద్వారా సంచార చికిత్స కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 104 వాహనం ద్వారా ప్రతి గ్రామంలో నెలకు ఒక సారి వైద్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామంలో 83 మంది పరీక్షలు జరిపినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

- 290 క్వింటాళ్ల బియ్యం సీజ్

డోన్ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని గుత్తిరోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన రోడ్డులో జిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం (పీడీఎస్)ను పట్టుకున్నారు. లారీ డ్రైవర్ ప్రతాప్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. లారీలో 50 కేజీల కలిగిన 580 ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. 290 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యా న్ని డోన్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. నందికొట్కూరు చెందిన పెద్ద దర్గయ్య అనే వ్యక్తి బియ్యాన్ని గని గ్రామం నుంచి లారీలో లోడు చేసి బెంగుళూరుకు తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారుల విచారణలో తెలింది. జిల్లా విజిలెన్స్ సీఐలు పవన్ కుమార్, యుగంధర్ తనిఖీ చేసిన వారిలో ఉన్నారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దుకాణదారులు కాలం చెల్లిన ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే చర్య లు తప్పవని ఏవో రంగనేతాజీ అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలోగల వెంకటేశ్వర పురుగులు, ఎరువుల మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. బయో మందులు విక్రయిస్తే డీలర్‌షిప్ రద్దు చేస్తామని అన్నారు.